క్లుప్తంగా

గోశాలకు విరాళాల అందజేత



మండపేటలో గోశాల నిర్వాహకుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డులోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కామేశ్వరీ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన గోశాలకు పలువురు విరాళాలను అందజేశారు. పశువుల నిర్వహణ కష్టసాధ్యమవుతున్న తీరు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైంది. విషయం తెలుసుకున్న పలువురు గోశాల నిర్వహణకు నగదు, పశుగ్రాసం, దానా రూపాల్లో విరాళాలు అందజేశారు. దాతలు ద్వారా సమకూర్చిన రూ.43,131 విరాళం సొమ్మును శుక్రవారం ఇనపకోళ్ల గణేష్, ఉంగరాల రాంబాబు చేతుల మీదుగా గోశాల నిర్వాహకుడు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్ర శర్మకు అందజేశారు.

25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన



ద్రాక్షారామలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి

రామచంద్రపురం రూరల్: జిల్లా కేంద్రం అమలాపురంలో ఈ నెల 25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపు ఇచ్చారు. ద్రాక్షారామలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, రామచంద్రపురం పట్టణం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, పుణ్యమంతుల శివాజీ, దునే శ్రీనివాసరావు, నాయకులు మాధవపట్ల కృష్ణమూర్తి, అవసరాల వెంకట రమణమూర్తి, ఇందన వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో సేవా కార్యక్రమాలు

కపిలేశ్వరపురం (మండపేట): సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని మండపేటలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువజన సంఘం మండపేట పట్టణ అధ్యక్షుడు కొంతం ప్రసాద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని మండపేట ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ కార్యాలయంలో కేక్ కట్ చేసి నిరుపేదలకు అన్నదానం చేశారు. బ్లడ్ బ్యాంకు ద్వారా చిరంజీవి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో శెట్టి రవి, మోరమ్ బాలాజీ, గోపీకృష్ణ సాయి, బందారు సతీష్, మోటుపల్లి వీరబాబు పాల్గొన్నారు.



కోటిపల్లి మత్స్యకార కాలనీలో నీటమునిగిన ఇళ్లు



కూళ్ల వద్ద నీట మునిగిన ఇటుకల బట్టీ



కేదారిలంకలో నీట మునిగిన అరటి తోట



రేషన్ దుకాణంలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

లంక గ్రామాలకు గోదావరీ

- పెరిగిన వరద ఉధృతి
- నీట మునిగిన ఉద్యాన పంటలు
- ముంపులోనే మత్స్యకార కాలనీలు



కోటిపల్లి మత్స్యకార కాలనీలో ఇళ్లను చుట్టిముట్టిన వరద నీరు

కె.గంగవరం: లంక గ్రామాలు, గోదావరి పరివాహ ప్రాంత ప్రజలను వరద భయం వెంటాడుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేడయంతో కోటిపల్లి వద్ద వరద ఉధృతి మరింద పెరిగింది. వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ సముద్రంలో కలిసేందుకు పరుగులు తీస్తోంది. గంట గంటకూ వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాలు, గోదావరి పరవాహ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బ్రహ్మపూరి వద్ద గోశాల పూర్తిగా వరదనీటిలో చిక్కుకుంది. గోశాలలోని ఆవులు, దూడలను గట్టును కట్టి ఉంచారు.

కాలనీలను ముంచెత్తి..

గ్రామంలోని మదవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట వీధులను వరద నీరు ముంచెత్తింది. గోదావరి ఒడ్డునే ఉన్న పాకలలోనికి వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుమారు 100 గడ్డి, పెంకిటిళ్లలోకి వరదనీరు రావడంతో వారు పక్కనే ఉన్న బంధువుల ఇళ్లలో సర్దుకున్నారు. కొందర ఆ వరదనీటిలోనే ఇళ్లల్లోనే ఉండిపోయారు. ప్రతిరోజూ గోదావరిలో ఉండే నాటు పడవలు ఇళ్లముందుకు వచ్చి చేరాయి. మండల పరిధిలోని కూళ్ల నుంచి మసకపల్లి వరకు ఏటిగట్టు వెంబడి రైతులు పండిస్తున్న ఉద్యాన పంటులు నీటము నిగాయి. సుమారు 3 వేల ఎకరాల్లో కొబ్బరి, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు పూర్తిగా నీటము నిగాయి. వరద తగ్గినా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరి వరద నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మృత్యుంజరావు, ఎస్సై జానీ భాష హెచ్చరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం పర్యటించారు. కోటిపల్లిలోని కుమ్మరి సావరం వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో గట్టు పటిష్టతకు చర్యలు తీసుకుంటునట్టు అధికారులు తెలిపారు.

వ్యవసాయ క్షేత్రాలను తాకిన వరదనీరు

కపిలేశ్వరపురం: గోదావరి వరదనీరు శుక్రవారం లంక గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను తాకింది. ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ శ్రీనివాస్ తన రెవెన్యూ శాఖాధికారులతో కలిసి కేదారిలంక, నారాయణ లంక, వీధివారిలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లోని అరటి, కూరగాయల తోటల్లోకి వరదనీరు చేరింది. ఇప్పటికే రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల మండల స్థాయి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు తహసీల్దార్, పలు శాఖల అధికారులు లంక గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్దలు, రైతులతో సహాయక చర్యలపై చర్చించారు. అత్యవసరమైతే పంపిణీ చేసేందుకు లంక గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలను సిద్ధం చేశారు. వాటిని తహసీల్దార్ పరిశీలించారు. మరింత వరద పెరిగితే తలెత్తే పరిణామాలపట్ల లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్సీ తోటకు అభినందనలు



మండపేటలో ఎమ్మెల్సీ తోటకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కపిలేశ్వరపురం: మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఆ పార్టీ కపిలేశ్వరపురం మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ తోట నియమితులైన నేపథ్యంలో కపిలేశ్వరపురం మండల పరిషత్ విప్ పలివెల మధు, తదితరులు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, ఉమ్మిడిశెట్టి వీరవేణి, యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, సీహెచ్ సురేష్, పాలింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌కు ఉచిత శిక్షణ

రామచంద్రపురం రూరల్: షెడ్యూల్ కులాలకు చెందిన పురుషులు, స్త్రీలు ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా హెవీ వెహికల్ డ్రైవింగ్ ఉచితంగా నేర్పించేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు రామచంద్రపురం మండల ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి సమాచారం వచ్చిందని పేర్కొన్నారు.

జిల్లాలో ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు కనీసం ఏడాది కాలపరిమితి కలిగిన లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. వయస్సు 20 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాకినాడలోని కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూలు కులాల సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు కులధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలన్నారు. మరింత సమాచారం కోసం 62818 17023 నంబరును సంప్రదించాలని సూచించారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో చివరి శ్రావణ శుక్రవార పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పామర్రులో సామూహిక వరలక్ష్మీ పూజలు చేస్తున్న భక్తులు



వెల్లలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

కె.గంగవరం: శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పుస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని పామర్రు, కోట గ్రామాల్లో సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. పామర్రు మల్లేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. వీరికి గ్రామ నాయకులు వెండి రూపులు, పూజా సామగ్రి అందించారు. కోటిపల్లి కొట గ్రామంలో కొలువైన్న ధనధాన్యలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఎంపీపీ పంపన నాగమణి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వెల్లలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల వేంచేసిన సోమేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వైవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్యం జానకిరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవార పూజలు

కపిలేశ్వరపురం: నియోజకవర్గవ్యాప్తంగా శ్రావణ మాసంలో ఆఖరి శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పట్టణంలోని అమ్మవార్ల ఆలయాలను సందర్శించారు. ఆమె ఇంటిలో వరలక్ష్మీ పూజ చేశారు. ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమ, పువ్వులు సమర్పించారు. బూరెలు, గారెలు, పులిహోర, స్వీట్లు తదితర వంటలతో సారె సమర్పించారు. ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని 19 గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పూజల సందడి నెలకొంది. కేదారిలంకలోని ధనమ్మ మర్రిలో మహిళలు పూజలు చేశారు. అంగరలోని మధ్యాహ్నపు అమ్మవారు, తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు.

విజయదుర్గా పీఠంలో పూజలు



విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. విజయ వేంకటేశ్వరస్వామికి తులసి దళ అర్చనలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కాజులూరు: గొల్లపాలెం పెదవీధిలోని కృష్ణుడి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపును పురస్కరించుకుని స్థానిక యాదవసంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. విరాళాలు, దాతల ఆర్థిక సహకారంతో ఈ అన్నదానం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి



కె.గంగవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ సభ్యులు

కె.గంగవరం: రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిలాలో విలీనం చేయాలని జేఏసీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధూ, సీపీఐ నాయకులు పి.రాము, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుంగ రాజు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట శ్రీను, విక్టర్ నంద తదితరులు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుంచి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిపాలన, వైద్యం, విద్య, రవాణా, ఉద్యోగ అవకాశాల విషయంలో తీవ్రమైన ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. మరోవైపు కాకినాడ జిల్లా కేంద్రం రామచంద్రపురానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోనే ఉందని, ఆ జిల్లాలో విలీనం చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ పంపన నాగమణిని జేఏసీ సభ్యులు కలసి మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లా వెంకటేష్, సుధాకర్, నున్న చిట్టిబాబు, వెంకటరమన, రాజారెడ్డి, కాశీ లెనిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వ్యాఖ్యలు అసత్యం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు సల్మాన్ హుస్సేన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమైనవని వైఎస్సార్ సీపీ ఆర్‌టీఐ విభాగం నియోజకవర్గ కన్వీనర్, 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఖండించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువైందని, వైఎస్సార్ సీపీ మునిగిపోతుందంటూ చేసిన వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమైనదని రవికుమార్ అన్నారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు మొత్తం దేశాన్ని ఆకర్షించాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్న విషయం ప్రజలకు తెలుసు అని రవికుమార్ అన్నారు.


మెగా మార్ట్‌లో చోరీ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న మెగా మార్ట్ షాపులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు మార్ట్‌లోని రూ.25 వేల నగదును అపహరించారు. మార్ట్‌లోని కొన్ని వస్తువులను కూడా తస్కరించారు. క్లూస్ టీమ్ ఆ షాపునకు వచ్చి చోరీకి సంబంధించిన కొన్ని ఆధారాలను సేకరించింది. మార్ట్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరద తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అల్లవరం: వరద తీవత్ర తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఓ మాధవి అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత నీటమునిగిన బోడసకుర్రు మత్స్యకార కాలనీలో ప్రాంతాన్ని శుక్రవారం అధికారులతో కలసి పరిశీలించారు. డీఆర్‌ఓ మాధవి మాట్లాడుతూ వరద తీవ్రత ఎక్కువైతే సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధం కావాలన్నారు. వరద ప్రస్తుత పరిస్థితిపై రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, మత్స్యశాఖ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో చర్చించారు. గర్భిణులను సమీప పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి తరలించాలన్నారు. ఒక్క గర్భిణీ కూడా ఇంటి వద్ద ఉండకుండా పరిశీలించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయాలన్నారు. వరద బాధితులకు రక్షిత మంచినీరు ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు నెలల రేషన్ అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం పల్లిపాలెంలోని రేషన్ డిపోను డీఆర్‌ఓ మాధవి తనిఖీలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, అదనపు డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి, డాక్టర్ స్పందన, డీటీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నమో ఏకో దంతాయ !



మట్టి గణపతి



రాయవరంలో గణేష్ ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న చలువ పందిరి

- వినాయక చవితి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- సిద్ధమవుతున్న చలువ పందిళ్లు
- మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలంటున్న పర్యావరణ ప్రేమికులు

రాయవరం: గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరునికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. గణపతి నవరాత్ర ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా మండపేట రూరల్, రామచంద్రపురం రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలోని 120 గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని యువకులు ఉత్సవ కమిటీలుగా ఏర్పడి ఉత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతి గ్రామంలో దాదాపుగా ఐదారు చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆరు నుంచి 15 అడుగుల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు విగ్రహాల తయారీదార్లకు ఆర్డర్లు ఇచ్చారు. అలాగే గ్రామాలకు సైతం పాకిన లడ్డూ సంస్కృతిలో భాగంగా లడ్డూలను వినాయకుడి చేతిలో ఉంచేందుకు స్వీట్ స్టాల్స్‌కు ఉత్సవ కమిటీలు ఆర్డర్లు ఇచ్చాయి.

చిన్న ప్రతిమలే మేలు

బంకమట్టితో తయారైన విగ్రహాలను నిమజ్జనం చేస్తే అవి త్వరగా నీటిలో కలసి పోతాయి. బంకమట్టి నీటి స్వచ్ఛతను పెంచేందుకు దోహదం చేస్తుంది. చిన్న సైజు ప్రతిమలను ఏర్పాటు చేస్తే నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తవు. నిమజ్జనం సమయంలో చిన్న మట్టి విగ్రహాలు నీటిలో కరిగి జలానికి ఎటువంటి నష్టం కలగదు. పర్యావరణానికి మట్టి విగ్రహాలు ఎంతో ఉత్తమం. ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్న విగ్రహాలతో పాటు మండపాల్లో ప్రతిష్ఠించే భారీ విగ్రహాల వరకూ మట్టి గణపతినే ఏర్పాటు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

గణేష్ మండపాల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీఎస్://గణేష్‌ఉత్సవ్.నెట్ సైట్‌లో ఎంటర్ అవ్వగానే న్యూ అప్లికేషన్ క్లిక్ చేసి, మొబైల్ నంబరు ఎంటర్ చేయాలి. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబరు, ఈ–మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు నమోదు చేయాలి. గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఏ పోలీస్టేషన్ పరిధిలోకి వస్తుంది, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. గణేష్ నిమజ్జనం చేసే తేదీ, సమయం, వాహనం వివరాలు నమోదు చేసిన అనంతరం పోలీసులు మండపాన్ని పరిశీలించి, అనుమతులు మంజూరు చేస్తారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

మట్టిని బ్రహ్మ, విష్ణు స్వరూపంగా భావిస్తారు. స్వచ్ఛమైన బంకమట్టితో తయారు చేసిన గణనాథులను పూజిస్తే సర్వపాపాలు హరిస్తాయని, అది పుణ్య ప్రదమని వేదాలు, పురాణాలు ఘోషిస్తున్నాయి. రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో ఏకో దంతుడికి జై కొడదాం..అనే నినాదం మార్మోగుతుంది. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య పర్యావరణ కాలుష్యం. సమస్త జీవరాశిపై ఇది ప్రభావం చూపుతుంది. సకల విఘ్నాలను తొలగించే గణనాథుడి ప్రతిమల తయారీకి కృత్రిమ రంగులను వినియోగిస్తున్నారు. నిమజ్జనం అనంతరం ఇవి కాలుష్య కారకాలుగా మారి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. దీని నివారణకు మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణేష్ పందిళ్లు, మండపాలకు తప్పనిసరిగా అనుమతులు అవసరం. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా ఒక కమిటీగా ఏర్పడాలి. సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తాం. మండపాలకు ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదు. గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు సహకరించాలి.

బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న కామన

కపిలేశ్వరపురం (మండపేట): 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ఇటీవల బీహార్‌లో ఓటర్ల జాబితా వెల్లడి పలు అనుమానాలకు తావిస్తోందని ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర రావు అన్నారు. అప్రజాస్వామిక చర్యలకు చర్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండపేట పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధాని అయిన తొలి రోజుల్లో ఎన్నికల నిర్వహణ అనేక అనుమానాలతో జరిగిందని గుర్తు చేశారు. అదే ఒరవడి గత 2024 సార్వత్రిక ఎన్నికలు, ప్రస్తుతం బీహార్ ఎన్నికల్లోనూ స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఇకనైనా ప్రజలు అప్రమత్తమై మోదీ అప్రజాస్వామిక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో అప్రజాస్వామిక కార్యాచరణపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. బీహార్‌లో సాగుతున్న రాహుల్‌గాంధీ పాదయాత్రకు మద్దతుగా రాష్ట్రంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టామని తెలిపారు.